నేడు జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-17 బాల బాలికలకు కబడ్డీ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నారు. రేకుర్తి ఢిల్లీ డిఫెన్స్ కళాశాల మైదానంలో ఈ పోటీలను ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నామని సమాఖ్య జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలోని 16 మండలాల క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ అర్హత ఫారం, ఆధార్ జిరాక్స్, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.


ఇరుకురోడ్డుతో **ఇబ్బందులు** 7

నయీం ఆస్తులపై **విచారణ చేపట్టాలి** 7

మదింపు జరగక.. ఆదాయం పెరగక..

- భారీగా ఆస్తి పన్ను కోల్పోతున్న పంచాయతీలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు సరైన ఆదాయ వనరులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సక్రమంగా నిధులు విడుదల కావడం లేదు. వీధి దీపాలు, మంచినీటి పథకాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు, ట్రాక్టరు మరమ్మతులు, నిర్వహణ, పారిశుధ్యం, ఇతరత్రా పనులు చేపడుదామంటే పంచాయతీ ఖాతాల్లో డబ్బులు ఉండడం లేదు. సొంత ఆదాయ వనరులు (జనరల్ ఫండ్) పెంచుకునే అవకాశమున్నా గ్రామాల్లో ఆస్తి పన్ను వసూళ్లలో ఇంకా పాత విధానమే కొనసాగుతోంది. ఆస్తి రకం ఎలాంటిదైనా ఏడాదికి అయిదు శాతం మాత్రమే పెంచి వసూలు చేస్తున్నారు. దీంతో ఏటా ఆస్తి పన్ను డిమాండ్ పెరగడం లేదు. మండలంలో 19 గ్రామపంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలు కలుపుకొని మండలంలో 23 గ్రామాలు ఉన్నాయి. 2024-25 సంవత్సరంలో కొత్త పంచాయతీ రాజ్ చట్టం ఆధారంగా మండల వ్యాప్తంగా 3,55,216 రూపాయల విలువ చేసే ఇంటి భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. ఇళ్ల చుట్టు కొలతలు నమోదు చేసుకుని మార్కెట్ విలువ ఆధారంగా ఇంటికి అసెస్‌మెంట్ చేస్తే వాస్తవ పన్ను వస్తుంది. ఆస్తి పన్నుపై ఎనిమిది శాతం గ్రంథాలయ సెస్సు, 15 శాతం డ్రైనేజీ ట్యాక్స్, 15 శాతం వీధి దీపాల ట్యాక్స్, 10 శాతం తాగునీటి ట్యాక్స్ కలిపితే ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్ను రెట్టింపు వస్తుంది.



పెద్దపాపయ్యపల్లి గ్రామం

- గ్రామాల్లో పెరుగుతున్న కాంక్రీట్ భవనాలు..

గ్రామాల్లో పాతతరం పెంకుటిళ్లను, రేకుల షెడ్లను కూల్చివేసి అన్ని వసతులు కలిగిన విశాలమైన కాంక్రీటు భవనాలను నిర్మించుకుంటున్నారు. ఆస్తి పన్ను రికార్డులో మాత్రం ఇంకా పాత ఇళ్లగానే గుర్తించి పన్నులు వసూలు చేస్తున్నారు. ఏటా ఆస్తుల సంఖ్య పెరుగుతున్నా.. ఇళ్ల చుట్టు కొలతలు నమోదు చేయకుండా నామమాత్రంగానే పన్నులు విధించి వసూలు చేస్తున్నారు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా పన్నుల వసూలు

\- తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్.



పంచాయతీల్లో ఏటా ఆస్తి పన్ను ఐదు శాతం పెంచి వసూలు చేస్తున్నాం. గ్రామాల్లో కొత్త నివాస గృహాలను నిర్మించుకునే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణ కోసం అనుమతులు తీసుకోవాలి. అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటుంది.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పక్కన వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సుడా పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సుడా కార్యకలాపాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుడా పరిధిలో నూతన లేఅవుట్లు ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ప్రధాన రోడ్లలోని బ్రిడ్జిలపై ఇరువైపులా మొక్కలు ఏర్పాటు చేయాలని తెలిపారు. చొప్పదండి నియోజక వర్గంలోని కొక్కెరకుంట-కోనాయపల్లి రోడ్డుకు నిధులు కేటాయించామన్నారు. సుడాకు అభివృద్ధి చార్జీలు కట్టని పెట్రోల్ బంకులకు నోటీసులివ్వాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో అంజనేయులు, ఎస్‌ఈ రాజ్ కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈఈ రాజేంద్ర ప్రసాద్, టీపీవో శ్రీధర్ ప్రసాద్, టీపీఎస్ సంధ్య, అజ్మల్ పాల్గొన్నారు.

వెదురు ఉత్పత్తులు ఉపయోగించాలి



కలెక్టరేట్ ఎదుట వెదురు ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న మేదరి కులస్థులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను తగ్గించి వెదురు ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని జిల్లా, నగర మేదరి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గురువారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా, నగర మేదరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సందర్భంగా స్థానిక గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట వెదురు ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వెదురు బొంగుల ఉత్పత్తులను విని యోగిస్తు, వెదురుపై ఆధారపడిన కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ పాల్గొన్నారు.

ప్రపంచమంతా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



బధిర విద్యార్థులతో సైన్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతా యూనివర్సల్‌గా ఒకే సైన్ లాంగ్వేజ్ ఉండాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. సైగల భాషను అందరూ నేర్చుకోవాలని సూచించారు. అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ వారోత్సవాలు ఈనెల 22 నుంచి 28వరకు నిర్వహించనున్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ సైన్ లాంగ్వేజ్ ముందస్తు దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భాషలు లేని కాలంలో సైగల ద్వారానే కమ్యూనికేషన్ ఉండేదని అన్నారు. దివ్యాంగుల భావాలను అర్థం చేసుకొని వారితో మెరుగైన కమ్యూనికేషన్ ఉండాలనే ఉద్దేశంతో అక్షయ్ ఆకృతి ఫౌండేషన్ ద్వారా అధికారులకు, ఉత్సాహం ఉన్నవారికి సైన్ లాంగ్వేజ్ నేర్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ భాషను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. చట్టం ప్రకారం దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఐ ఈపీఐడీ బాధ్యులు డాక్టర్ హిమాన్షు, ప్రియాంక, నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, జీసీడీవో కృపారాణి, తహసీల్దార్ నరేందర్,బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ కమల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పద్ధతుల్లో విద్యాబోధన

కరీంనగర్ టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) జిల్లా స్థాయి మేళాను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతగానో ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యాశాఖ నిర్వహిస్తున్న కరీంనగర్ విద్యావాహిని యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజలకు, తల్లిదండ్రులకు మెటీరియల్ చూపించాలని అన్నారు. చక్కటి టీఎల్‌ఎంలను ప్రదర్శించిన ఉపాధ్యాయులు సమత (తెలుగు, ఎంపీపీఎస్, గునుకుల కొండాపూర్), ఎస్ సంతోష్‌కుమార్ (ఇంగ్లీష్, ఎంపీయూపీఎస్, ఆముదాలపల్లి), సాయికుమార్ (గణితం, ఎంపీపీఎస్ మల్కాపూర్), కె రాము (పరిసరాల విజ్ఞానం, ఎంపీపీఎస్, లింగాపూర్), మహమదీ బేగం (ఉర్దూ, జీపీఎస్, ముకరంపుర)ను సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో మొండయ్య, విద్యాశాఖ కో ఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

- పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి...

కరీంనగర్ క్రైం: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కంపెనీలు, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై గురువారం జడ్పీ సమావేశ మందిరంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. పది మంది కంటే ఎక్కువ కార్మికులు లేదా ఉద్యోగులు ఉన్న అన్ని సంస్థలు, కంపెనీలు కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు పూర్తి చేయాలన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితురాలు తప్పనిసరిగా తమ సంస్థ లేదా కార్యాలయంలోని ఐసీసీలో ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్, మెప్మా పీడీ స్వరూపారాణి, సీడీపీవో సబిత, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, అడిషనల్ డీఎంహెచ్‌వో సుధా, అడిషనల్ డీ ఆర్డీవో రవికుమార్, ట్రస్మా చైర్మన్ శేఖర్‌రావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



ఇల్లందకుంటలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో, గరుడ చౌరస్తాలో బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సేవా పక్షం అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని కేంద్ర నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. పల్లెలు బాగుండాలంటే స్థానిక సంస్థల్లో బీజేపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, గుత్తికొండ రాం బాబు, తాళ్ల పాపిరెడ్డి, మట్ట పవన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, రావుల విజయ్‌బాబు, దుర్గయ్య, రమేష్, కిషన్‌రెడ్డి, సమ్మయ్య, సంజీవ్, శ్రీధర్, మురళీ, భరత్ పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ లేనట్లేనా?

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదంటున్న అధికారులు

జమ్మికుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళారుల మధ్యవర్తిత్వం లేకుండా రైతులు నేరుగా పత్తిని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకు వచ్చింది. రాష్ట్రంలో ఇప్పటికే అగ్రికల్చర్ క్రాప్ బుకింగ్ సాఫ్ట్‌వేర్ అనుసంధానంతో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపడుతుంది. కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభమైనా చాలా మంది రైతులకు యాప్‌పై అవగాహన లేదు. యాప్ అమలుపై తమకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న సీసీఐ ఉన్నతాధికారి (ఫైల్)

- అవగాహన కల్పించని అధికారులు

పత్తి కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా ప్రభుత్వ మద్దతు ధర రైతులకు దక్కాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకుంటేనే ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది. లేని పక్షంలో ప్రైవేట్ ట్రేడర్స్‌కు అమ్ముకోవాల్సి వస్తుందని ప్రచారం జరుగుతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది సీసీఐ పత్తి కొనుగోళ్లలో టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్)లో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకొని ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. చాలా మంది రైతులకు కపాస్ కిసాన్ యాప్ గురించి తెలియదు. అవగాహన కల్పించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు యాప్ అమలు గురించి తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. తాజాగా కలెక్టరేట్‌లో సీసీఐ కొనుగోళ్ల విషయంలో జరిగిన ఆయా శాఖల ఉన్నతాధికారుల సమావేశంలో కపాస్ కిసాన్ యాప్ అమలు గురించి ప్రస్తావన రాలేదని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. దీన్నిబట్టి చూస్తే ఈ ఏడాది కపాస్ కిసాన్ యాప్ లేనట్లే అని తెలుస్తుంది.

- ఆధార్ అథెంటిఫికేషన్ ద్వారా పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో గత ఏడాది మాదిరిగా ఆధార్ అథెంటికేషన్ విధానం ద్వారా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టాలని భావిస్తోంది. అగ్రికల్చర్ క్రాప్ బుకింగ్ సాఫ్ట్‌వేర్ అనుసంధానంతో పత్తి కొనుగోళ్లు జరగనున్నాయి.

పత్తి సేకరణకు ఏర్పాట్లు పూర్తి చేయండి

కరీంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పత్తి పంట సేకరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలుపై సంబంధిత అధికారులు, ట్రేడర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 44,885 ఎకరాల్లో పత్తి సాగైందని అన్నారు. 5,38,620 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశామని తెలిపారు. కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని 15 జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రమాణికమని, రైతులందరు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో మరమ్మతులు పూర్తి చేసుకోవాలని, ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఐ, విద్యుత్ తదితర శాఖల అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

హిందీతో ఉద్యోగావకాశాలు

- అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసాల వరప్రసాద్



విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసాల వరప్రసాద్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత దేశం వంటి బహుభాషా దేశంలో హిందీ నేర్చుకోవడం ద్వారా అనేకరంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసాల వరప్రసాద్ అన్నారు. గురువారం కరీంనగర్ ఎస్సార్ఆర్ ప్రభుత్వ కళాశాలలో హిందీ భాషా వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హిందీలో ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ మాట్లాడుతూ మన అధికార భాష, జాతీయ భాష హిందీకి గౌరవం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. విద్య, వ్యాపారం, ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ వినియోగాన్ని పెంచినపుడే జాతీయ ఏకత సాధ్యమవుతుందని అన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ కొమురారెడ్డి, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ ఉపన్యాసం, పాటలు, కవితల ద్వారా హిందీ భాష ప్రాధాన్యాన్ని వివరించారు. రెహాన్‌అలీ, శ్రీనివాసన్, రాహుల్, సందీప్, అఖిల్, అటూపా మహీన్ తదితర విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ వాసాల వరప్రసాద్‌ను, అతిథులను సన్మానించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా డాక్టర్ అలీ ఖాన్, జూనియర్ కళాశాల హిందీ ఉపాధ్యాయుడు కనకయ్య, మధు, రాజేశ్, డాక్టర్ తిరుపతి, సుధాకర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

మానకొండూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. టమాట, వంకాయ, పాలకూర, చుక్క కూర, మెంతి, గంగవాయిలి మొక్కలను నాటారు. నాటిన మొక్కలను పశువుల నుంచి కాపాడేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శనం ట్రిగార్డులు ఏర్పాటు చేశారు. కిచెన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ట్రిగార్డ్స్‌ను రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక సీఐకి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సంజీవ్ విద్యార్థులతో మాట్లాడారు. రెండు రోజుల్లో దొంగను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

యువకుడి రిమాండ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట),సెప్టెంబరు18((ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం వారెంటును జారీ చేయడంతో వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామానికి చెందిన యువకుడు భూక్య మోహన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ లక్ష్మణ్ గురువారం తెలిపారు. 2024లో యువకుడిపై అప్పటి పోలీసులు కేసును నమోదు చేశారని పేర్కొన్నారు. వాయిదాలకు న్యాయస్థానంలో మోహన్ హాజరు కాకపోవడంతో యువకుడికి వారెంట్ జారీ అయిందని చెప్పారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు యువకుడు మోహన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

తిరుపతిలో డిజిటల్ అరెస్ట్ పేరుతో రెండు కోట్లు టోకరా

- మల్యాల యువకుల ఖాతాలకు రూ.8లక్షలు
- సైబర్ పోలీసుల అదుపులో యువకులు

మల్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో డిజిటల్ అరెస్ట్ పేరిట రెండు కోట్లకు టోకరా వేసిన ఘటనలో రూ.8 లక్షలు మల్యాల మండల యువకుల ఖాతాలో జమకావడంతో ఆంధ్రప్రదేశ్ పోలీసులు బుధవారం రాత్రి మల్యాల యువకులను అదుపులోకి తీసుకోవడం చర్చనీయంశంగా మారింది.

డిజిటల్ అరెస్టుపై అక్కడి సైబర్ పోలీసులు విచారణ జరుపుతున్న క్రమంలో మల్యాలకు చెందిన ఇద్దరు యువకుల ఖాతాల్లో రూ.8లక్షలు జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా బుధవారం మల్యాలకు చేరుకొని ఆ యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఘటనలో జగిత్యాలకు చెందిన వారిని కూడా అక్కడి పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

అక్రమంగా మట్టి తరలింపు

- రెండు టిప్పర్లు, ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్ సీజ్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారం మేరకు బుధవారం రాత్రి పెద్దపల్లి రూరల్‌ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో రెండు టిప్పర్‌లు, ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాటిని పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలతో యువకుడి అరెస్ట్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల తో వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామానికి చెందిన భూక్య మోహన్ ను అరెస్ట్ చేశామని ఎస్ఐ లక్ష్మణ్ గురువారం తెలిపారు. 2024లో మహిళపై అత్యాచారం చేసిన ఘటనపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. వరుసగా వాయిదాలకు న్యాయస్థానంలో మోహన్ హాజరుకాకపోవడంతో యువకుడికి వారెంట్ జారీ అయ్యిందని చెప్పారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కిసాన్ నగర్‌లో 2024 ఆగస్టు 28న కొయ్యడ వెంకటేష్ అనే వ్యక్తి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడికి సీఐ జాన్‌రెడ్డి ఫోన్ అప్పగించారు. ఫోన్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్‌ను సీఐ అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

పాలకుర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన అమరగాని రాజయ్య(58) కుటుం బ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకి తరలించారు. అక్క డ చికిత్స పొందుతూ రాజయ్య గురువారం మృతిచెం దాడు. బసంత్‌న గర్ ఎస్సై ఆర్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫేక్ సర్టిఫికెట్లపై ఫిర్యాదు : కేసు నమోదు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌ని రోజాస్ బ్యూటీ వరల్డ్ అండ్ బ్యూటీ స్కూల్ సంస్థ పేరిట కృష్ణవేని అనే మహిళ ఫేక్ సర్టిఫికెట్లు తయారు చేసి 2 లక్షలకు అమ్ముకుందని ఆ బ్యూటీ స్కూల్ నిర్వహకురాలు శైలజ ఫిర్యాదు మేరకు కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిజామాబాద్ జిల్లాలో మోడల్‌స్కూల్ అధికారులు సర్టిఫికెట్‌ల స్క్రూటినీలో కరీంనగర్ రోజాస్ బ్యూటీ వరల్డ్ అండ్ బ్యూటీ స్కూల్ సంస్థ నిర్వాహకులకు ఫోన్ చేసి సర్టిఫికెట్లు మీరు జారీ చేసినవేనా? అని అడగగా ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం బయటపడింది. ఆ వ్యక్తులకు తాము సర్టిఫికెట్లు ఇవ్వలేదని చెప్పిన అనంతరం ఆరాతీ యగా గతంలో కరీంనగర్ రోజాస్ బ్యూటీ వరల్డ్ అండ్ బ్యూటీ స్కూల్‌లో శిక్షణ పొంది, పెద్దపల్లి జిల్లాలో ఉద్యోగం చేస్తున్న కృష్ణవేణి అనే మహిళ సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పంప్‌మోటార్ చోరీ

మల్యాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన పోతరాజు బక్కయ్య అనే రైతు వ్యవసాయ పొలం వద్ద గల పంప్‌మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గతంలో రెండు సార్లు కూడా పంప్‌మోటార్ చోరీకి గురి కావడంతో సీసీ కెమెరా అమర్చాడు. అయినప్పటికీ మళ్లీ చోరీకి గురికావడంతో రైతు పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. పగటి సమయంలో రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది.

జగిత్యాల రూరల్ మండలంలో వరుస దొంగతనాలు

సంగంపల్లిలో మరో చోరీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలో చైన్‌స్నాచర్లు మరోసారి రెచ్చిపోయారు. ఈ నెల 10న పోరండ్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు మెడనుంచి బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మరువకముందే సంగంపల్లిలో అదే తరహాలో మరో చోరీ జరిగింది. జగిత్యాల రూరల్ మండలం సంఘంపల్లి గ్రామా నికి చెందిన నేరెళ్ల లచ్చువ్వ (85) ఒంటరిగా ఉండడాన్ని గమనించిన దొంగ నేరుగా ఇంట్లోకి వెళ్లాడు. వృద్ధాప్యం కారణంగా కంటిచూపు మందగించిన లచ్చువ్వ వచ్చిన వ్యక్తి మనువడే అనుకొని పొరబడి తాగడానికి నీళ్లు ఇచ్చింది. ఆమెను నమ్మించిన ఆ గుర్తుతెలియని వ్యక్తి ఆకస్మాత్తుగా మెడలో ఉన్న తులంనర బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. 9 రోజుల వ్యవధిలోనే వరుసగా రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో, దొంగలు కావాలనే వృద్ధులను టార్గెట్ చేస్తున్నట్లు పోలీసులు భావిస్తు న్నారు. అయితే ఈ రెండు దొంగతనాల్లో చోరీకి పాల్పడింది ఒకే వ్యక్తినా, లేక వేర్వేరు వ్యక్తులా అనేది తేలాల్సి ఉంది. సంఘంపల్లిలో చోరీ జరిగిన సంఘటన స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్.ఐ సుధాకర్ పరిశీలించారు.

శివకేశవ స్వామి ఆలయానికి పూర్వవైభవం

- గ్రామస్థుల ఐక్యతతో కాకతీయుల కోవెలకు కొత్త కళ
- రూ.30 లక్షలతో ఆధునికీకరణ పనులు
- 22 నుంచి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు కాకతీయుల కళావైభవాన్ని చాటిన ఆలయం శిథిలావస్థకు చేరిపోయింది.. ఆలయ పరిస్థితిని చూసిన ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆధునీకరించారు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామస్థులు. రూ.30 లక్షలతో ఆలయ రూపురేఖలు మార్చి ఈనెల 22 నుంచి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



శివకేశవ స్వామి కొత్త ఆలయం

ఐక్యతతో పూర్వ వైభవం

రాచర్లబొప్పాపూర్‌లోని శివకేశవ స్వామి ఆలయం సుమారు 1200 ఏళ్ల కిందట కాకతీయుల కాలంలో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలున్నాయి. కొంత కాలంగా ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. శివ కేశవ స్వామి, శివుడు, ఆంజనేయ స్వామిలు దూపదీప పూజలకే పరిమితయ్యారు. భక్తుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. ఆలయాన్ని పట్టించుకునే వారు లేకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుని ఆదరణ కరవైంది. ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం, అధికారుల చుట్టు తిరిగిన ఫలితం లేకుండాపోయింది. దాంతో గ్రామస్థులు పురాతన ఆలయాలను కాపాడుకోవాలని భావించారు. ఐక్యమత్యంతో డబ్బులు పోగు చేసి ఆలయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. 75 మంది సభ్యులతో ఆలయ భక్త బృందం కమిటీని ఏర్పాటు చేశారు. సుమారు రూ.15 లక్షలతో ఆధునీకరణ పనులను ప్రారంభించారు. శివ కేశవ, శివాలయం గోడలను పునరుద్ధరించారు.



శివాలయం

నూతనంగా ఆలయ గోపురం, ఆంజనేయ స్వామి ఆలయం, నవ గ్రహాలయం, సంతాన నాగేంద్రస్వామి ఆలయాలను నిర్మించారు. శివ కేశవ స్వామి ఆలయ గర్భ గుడి, హాలులను పాత రాతితో పనులను పూర్తిచేయించారు. ఆలయ గోపురం వద్ద, ఎదుట విగ్రహాలను ఏర్పాటు చేసేలా చేపట్టారు. ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం చేయించి బిగించారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈనెల 22 నుంచి 24 వరకు స్వామి వారి కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆలయాలు ఆధునీకరణతో పూర్వ వైభవం సంతరించుకుంది.

కుమారులు పోషించడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

- కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు

వీణవంక, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన కంబాల రాయమల్లు భార్య చెన్నమ్మ తమ ఇద్దరు కుమారులు పోషించడం లేదని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కలెక్టర్ హుజూరాబాద్ ఆర్డీవోకు ఆదేశాలివ్వగా రాయమల్లు పోషణ నిమిత్తం ఇద్దరు కుమారులు నెలకు నాలుగు వేల రుపాయలు ఇవ్వాలని ఆదేశిం చారు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా పెద్ద కుమారుడు కంబాల స్వామి, చిన్న కుమారుడు గట్టయ్య వీరు గత కొంతకాలంగా తల్లిదండ్రులను పోషించకపోవడంతో మనోవేదన గురై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చి నాలుగు వేల చొప్పున ఇవ్వాలని అదేశించా రు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సంక్షేమ అధికార బృందం గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టి చెన్నమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమారులు పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని తెలుపడంతో అధికారులు కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు రూ. 16000 ఇప్పించారు. తల్లిదండ్రులకు కనీస సౌకర్యలు చుసుకోవాలని సూచించారు. పెద్ద కుమారుడు ఆర్టీసీ ఉద్యోగి కాగా కోడలు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి తల్లిదండ్రులను పోషించకపోవడంతో గ్రామస్థులు మండి పడుతున్నారు. తల్లిదండ్రులను పోషించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. విచారణలో ఆర్ఐ రవి, డీవీసి కౌన్సిలర్ పద్మావతి, చైల్డ్ హెల్ప్‌లైన్ సాయి కిరణ్‌గౌడ్, పోలీస్ సిబ్బంది వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.



బేతిగల్ గ్రామంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రభుత్వాస్పత్రిలో పేషెంట్లకు సేవ

- డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి కోర్టు శిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పేషెంట్లకు మూడు రోజులు సేవచేయాలని డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి కోర్టు శిక్ష విధించింది. కరీంనగర్‌కు చెందిన వంతడుపుల రాజేష్, సోనాకుల్ల కృష్ణ మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడుపగా ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేశారు. గురువారం కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మూడు రోజులు కమ్యూనిటీ సర్వీసు కింద కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించాలని కరీంనగర్ సెకండ్‌క్లాస్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ కె.లక్ష్మి ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.93 వేలు స్వాహా

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ వ్యక్తి రూ.93 వేల 372 మోస పోయాడు. బాధితుడు గురువారం కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ మారుతీనగర్‌కు చెందిన శ్రీరామోజు రఘు ఫోన్‌కు ఆగస్టు 13న ట్రేడింగ్‌లో రూ.20 వేలు ఇన్వెస్ట్ చేయాలని వాట్సప్‌లో క్యూఆర్‌కోడ్ వచ్చింది. దీనిని నమ్మిన రఘు రూ.20 వేలు బాబూలాల్ మీనా అనే వ్యక్తికి ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి బదిలీ చేశాడు. రూ.20 వేల పెట్టుబడికి రూ.98,653 లాభం వచ్చిందని వాట్సప్‌కు మరో మెస్సేజ్ వచ్చింది. ఆ డబ్బులు పంపించాలంటే ట్యాక్స్ చెల్లించాలని చెప్పగా మరో రూ.20 వేలు పంపించాడు. ఆ తరువాత మరో టాక్స్ అంటూ పలు దఫాలుగా మొత్తం 93 వేల 372 రూపాయలు బదిలీ చేయించుకున్నాడు. ఆ తరువాత ఫోన్‌కు వాట్సప్ మెస్సేజ్‌లు చేసినా స్పందించలేదు.

తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930 కాల్ చేసి, సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. గురు వారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కేసు నమోదు చేశారు.

పెద్దపల్లిలో పనిచేయని టీ హబ్

- 15 రోజులుగా నిర్ధారణ కాని పరీక్షలు
- ప్రజల ఇబ్బందులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగనిర్ధారణ పరీక్షలు జరుగక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్షం రోజులుగా పెద్దపల్లిలోని టీహబ్ కేంద్రం పనిచేయకపోవడంతో రోగ నిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో టీ హబ్ లేకపోవడంతో ఇక్కడ సేకరించిన రక్తనమూనాలను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని టీ హబ్‌కు పంపుతుండేవారు. ఇక్కడ ఉండాల్సి టీ హబ్ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. టీ హబ్ కేంద్రంలో 200రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వర్షాకాల సీజన్ కావడంతో రోజుకు 1500నుంచి 1700మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ఇందులో చాలా మందికి రక్తనమూనాలు సేకరించి పెద్దపల్లికి పంపుతుండగా అక్కడ టీ హబ్ పనిచేయకపోవడంతో రోగ నిర్ధారణ పరీక్షలు తెలియకపోవడంతో గోదావరిఖనిలోని ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కేవలం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీబీపీ, కిడ్నీ, షుగర్, లివర్‌కు సంబంధించిన పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. మిగతా పరీక్షలు ఫ్యాటీలీవర్, యూరిక్ ఆసిడ్, డీ-12, కొలస్ట్రాల్, లిపిడ్ ప్రొఫైల్ వంటి టెస్టులు పెద్దపల్లికి పంపుతున్నారు. అక్కడ నిర్ధారణ కాకపోవడంతో చాలామంది రోగులు వేలకు వేలు పెట్టి ప్రైవేట్ ల్యాబ్‌ల్లో టెస్ట్‌లు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పక్షం రోజులుగా పెద్దపల్లిలో టీ హబ్ పనిచేయకపోవడం రోగులకు శాపంగా మారింది. ఇప్పటికైనా టీ హబ్‌ను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- తప్పించుకునే ప్రయత్నంలో కింద పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. తప్పించుకునే ప్రయత్నంలో కింద పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో ఏడుగురు వ్యక్తులు గ్రామశివారులోని ఓ గుడిసెలో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఐదుగురు వ్యక్తులు పారిపోయేందుకు పరుగులు తీశారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన చాకలి రాజయ్య(45) భయంతో పరుగులు తీసి సమీపంలోని వాగు ప్రాంతంలో కింద పడి మృతిచెందాడు. గుడిసెలో ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9130 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనపర్చుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. చీకటి పడినా రాజయ్య ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా వాగు సమీపంలో రాజయ్య మృతిచెంది ఉన్నాడు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పరుగులు తీసి కింద పడి మృతిచెందాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పరుగులు తీయడం వల్ల గుండెపోటు వచ్చి చనిపోయాడని అనుమానిస్తున్నారు. రాజయ్య మృతికి పోలీసులే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య రేణవ్వ, కూతురు సోనీ, కొడుకు సాయిలు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరేందుకు సెల్‌ఫోనులో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

అండర్ 19 క్రీడాపోటీలు ప్రారంభం

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక పొన్నాల గార్డెన్‌లో గురువారం 69వ ఎస్‌జీఎఫ్ ఈస్ట్‌వైల్ కరీంనగర్ బాక్సింగ్ , తైక్వాండో, కరాటే, మార్షల్ ఆర్ట్స్ క్రీడలకు సంబంధించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందని అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రెటరీ మధుజాన్సన్ తెలిపారు. ఈ క్రీడాపోటీలను జగిత్యాల డీఐఈవో నారాయణ, రిటైర్డ్ డీఐఈవో మనోహర్‌లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఐఈవో నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని, ఇటీవల కాలంలో తెలంగాణలోని నిఖత్, జరీన్, సిరాజ్, దీప్తి వంటి వారిని గుర్తించి నజరానా అందించి ప్రోత్సహించిందని గుర్తుచేశారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని మరింత ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల నుంచి సుమారు 260మంది క్రీడాకారులు పోటీపడ్డట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు పీడీలు, కోచ్‌లు సరిత, రాజశేఖర్, ఆరుముళ్ల పవన్, శ్రీనివాస్, రాజేందర్. సంతోష్, నవీన్, రాజశేఖర్, నరేష్, గౌతమ్, శ్రీకాంత్ తో పాటు వివిధ కళాశాలల క్రీడాకారులు, వారి పోషకులు పాల్గొన్నారు.



తలపడుతున్న క్రీడాకారులు

నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్

హుజూరాబాద్ ఏసీపీ మాధవి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని హుజూరాబాద్ ఏసీపీ మాధవి పేర్కొన్నారు. గురువారం జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో తెల్లవారు జామున పోలీస్‌లు కార్డన్‌సెర్చ్ చేశారు. గ్రామంలోని పలు ఇళ్లలోకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు, అనుమతి పత్రాలు లేని ట్రాక్టర్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకుని జమ్మికుంట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనంతరం జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఏసీపీ మాట్లాడుతూ ఇసుక లోడుతో ఉన్న 15ట్రాక్టర్లు, అనుమతి పత్రాలు లేని 15 ట్రాక్టర్లు మొత్తం 30ట్రాక్టర్లు అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అనుమతి పత్రాలు చూపిస్తే ట్రాక్టర్లు ఇస్తామని, ఇసుక లోడు ఉన్న ట్రాక్టర్లను మాత్రం సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయడమే కార్డన్‌సెర్చ్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



విలాసాగర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏసీపీ మాధవి

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



నవీన్ ఫైల్

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జమ్మికుంట మండలం శాంతినగర్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వీణవంక మండలం కొండపాక గ్రామానికి చెందిన కొలుగూరి నవీన్ (22) తాపి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కోరపల్లి గ్రామానికి చెందిన శ్వేతతో ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. జమ్మికుంట మండలం మడిపల్లిలో బంధువుల్లో ఒకరు మృతి చెందగా అంత్యక్రియలకు నవీన్ హాజరయ్యాడు. అనంతరం ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గం మధ్యలో శాంతినగర్ సమీపంలో ప్రమాదవశాత్తు డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

పలువురికి గాయాలు



సిరిసిల్ల జిల్లా అస్పత్రికి చికిత్స కోసం వచ్చిన బాధితులు

సిరిసిల్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బివైనగర్, ఇందిరానగర్, గోపాల్‌నగర్, మార్కెట్ ఏరియా, వెంకట్రావునగర్ ప్రాంతాల్లో పిచ్చికుక్క రోడ్లపై జనాలను కరుస్తూ పరుగులు తీసింది. వివిధ ప్రాంతాల్లో పలువురిని పిచ్చికుక్క గాయపరిచింది. గాయపడిన వారు సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందారు.

సమస్యలకు పరిష్కారం కోరుతూ సీఎంకు అధ్యాపకుల వినతి



ముఖ్యమంత్రిని కలిసిన అధ్యాపకులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొడారు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని అధ్యాపకుల బృందం గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన అధ్యాపకులు చాలా కాలంగా కళాశాల విద్యాశాఖలో అధ్యాపకులకు సంబంధించిన కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటివల్ల ప్రస్తుతం పదవీ విరమణ పొందుతున్న అధ్యాపకులు వారికి రావాల్సిన పెన్షన్ పొందలేక పోతున్నారని ముఖ్యమంత్రి ఈ విషయమై వెంటనే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అధ్యాపకుల సమస్యలపై ముఖ్యమంత్రికి వివరించారు.

టీఎల్‌ఎం మేళాలో రాష్ట్రస్థాయికి ఎంపిక

గన్నేరువరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జిల్లా స్థాయిలో గురువారం నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో గన్నేరువరం మండలం నుంచి పదిమంది ఉపాధ్యాయులు పాల్గొనగా తెలుగులో గునుకుల కొండాపూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు సమత ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంగ్లీషులో అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు శ్రీలత రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో ఇద్దరు టీచర్లను ఎంఈవో రామయ్య అభినందించారు.

రాజన్న ఖజానాకు రూ. 1.21 కోట్లు

● 64.90 గ్రాముల బంగారం, 7.30 కిలోల వెండి



వేములవాడలో హుండీ లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న ఆలయ ఖజానాకు రూ. ఒక కోటి 21 లక్షల 70 వేల 150 నగదు, 64.90 గ్రాముల మిశ్రమ బంగారం, 7.30 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య హుండీలను విప్పి లెక్కించారు. ఆలయంలోని 29 రోజుల హుండీలను లెక్కించగా ఒక కోటి 21 లక్షల 70 వేల 150 నగదు, మిశ్రమ బంగారం 64 గ్రాముల 900మిల్లీ గ్రాములు, 7 కిలోల 300 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు. ఉదయం ప్రారంభమైన హుండీ లెక్కింపు రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. ఈ హుండీ లెక్కింపును ఆలయ ఈవో రమాదేవి, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణలు పర్యవేక్షించగా ఆలయ ఏఈవోలు, సూపరిండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు ఉద్యోగులు, సిబ్బందితో పాటు శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి దేవీనవరాత్రోత్సవాలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీదేవీనవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 29వ తేదీ సోమవారం రోజున ఉదయం 9.30 గంటలకు మూలా నక్షత్ర పుస్తక రూపిణి మహాసరస్వతి పూజ, తేది 30వ తేదీ మంగళవారం రోజున దుర్గాష్టమి సందర్భంగా చండీహవనము రాత్రి 8 గంటలకు శ్రీమహిషాసురమర్ధినీ అమ్మవారికి మహాపూజ ఘనంగా నిర్వహించనున్నారు. అక్టోబరు ఒకటవ తేదీన బుధవారం మహార్నవమిని పురస్కరించుకుని పూర్ణాహుతి, బలిహరణ రాత్రి 8.15 గంటలకు శ్రీస్వామి వారి ధర్మగుండం నందు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 2వ తేది గురువారం రోజున విజయదశమి (దసరా) సందర్భంగా ఉదయం 10 గంటలకు ఆయుధపూజ సాయంత్రం 5 గంటలకు శ్రీస్వామి వారి పెద్దసేవ (అంబారీ సేవ), శ్రీస్వామి, అమ్మవార్ల శమీపూజ, అపరాజిత పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి వారికి 11 రోజుల పాటు నిత్యకల్యాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

రోజుకోక అలంకారంతో అమ్మవారి దర్శనం..

రాజన్న ఆలయంలో చేపట్టే శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు అమ్మవారు రోజు ఒక అలంకారముతో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 22వ తేదీన మొదటి రోజు ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా శైలపుత్రి అలంకారములో దర్శనమిస్తారు. పదకొండవ రోజు గురువారం దసరా సందర్భంగా శ్రీమహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిస్తారు.

తెగుళ్లతో రైతు దిగాలు



- వరి చిరు పొట్ట దశలో సోకిన ఎండాకు తెగులు
- అధిక యూరియా, వాతవరణ మార్పులే కారణమంటున్న శాస్త్రేత్తలు
- జిల్లాలో 3.13 లక్షల ఎకరాల్లో వరి సాగు

జగిత్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులకు తెగుళ్లతో అవస్థలు తప్పడం లేదు. జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరు పొట్ట దశలో ఉన్న వరి తెగుళ్ల బారిన పడుతోంది. వరి పంటకు ఎండాకు తెగులు సోకి అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో మొగి పురుగు ప్రభావం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65.52 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుండగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 3,13,317 ఎకరాల్లో వరి సాగవుతోంది. ప్రస్తుతం జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి వ్యవసాయ సబ్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో వరి పైరుకు ఎండాకు తెగులు, మొగి పురుగు బెడద తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో 25 శాతం వరకు వరి పైరుకు ఎండాకు తెగులు, మొగి పురుగు సోకింది. జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగినప్పటికీ చీడ పీడల దాడులతో ఏమి చేయాలో తోచక రైతులు మందులను విపరీతంగా వినియోగిస్తూ వ్యవసాయ పెట్టుబడుల అదనపు భారం మోస్తున్నారు.



సారంగాపూర్‌లో ఎండాకు తెగులు సోకిన వరి పంట

● ఎండాకు తెగులు సోకడానికి కారణాలు..

జిల్లాలో వరి పంటకు ఎండాకు తెగులు సోకడానికి వివిధ కారణా లుంటాయని శాస్త్రవేత్తలు, వ్యవ సాయ అధికారులు, నిపుణులు అం టున్నారు. భారీ వర్షాలు కురవడం, ఆ వెంటనే తీవ్రమైన ఎండలతో వాతావరణం అసమత్యులంతో తెగు ళ్లు సోకుతున్నాయి. దీనికి తోడు పరిమితికి మించి రైతులు యూరియా చల్లడం కారణంగా భావిస్తున్నారు. వాస్తవానికి ఎకరానికి మూడు బస్తా లు సరిపోతుండగా, రైతులు పొలం త్వరగా ఎదగాలనే ఉద్దేశంతో ఎకరా నికి నాలుగైదు బస్తాల యూరియా చల్లడంతో తెగుళ్ల, చీడపీడలు సోకు తున్నాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అంటున్నారు. మొక్క పైభాగంలో తెల్లటి మచ్చలు ఏర్పడి ఆకులు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఇది ఒకటి, రెండు మొక్కలతో మొ దలై పొలమంతా వ్యాపిస్తోంది. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

తెగులు సోకి పొలం ఎర్ర బారుతోంది

-బింగి నర్సయ్య, రైతు, రేచపల్లి గ్రామం, సారంగపూర్ మండలం



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి పంటకు ఎండాకు తెగులు సోకి పొలం అక్కడక్కడ ఎర్రబారుతోంది. వరిలో ఎక్కడో ఒకచోట కనిపిస్తున్న తెగులు తొందరగానే వ్యాపిస్తోంది. బ్యాక్టీరియా సోకడంతో మున్ముందు దిగుబడిపై ప్రభావం పడుతుందన్న ఆందోళన నెలకొంది. తెగులు వ్యాప్తి చెందకుండా ఉండడానికి మందులు పిచికారి చేయాల్సి వస్తోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

-బలరాం, శాస్త్రవేత్త, సీడ్ రీసెర్చ్ టెక్నాలజీ సెంటర్, హైదరాబాద్



వరికి ఎండాకు తెగులు కనిపించిన వెంటనే యూరియా చల్లడం ఆపివేయాలి. ఒకవేళ చల్లినట్లయితే ఎండాకు తెగులు ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. పొలంలో ఎక్కువగా నీరు ఉండకుండా బురద పొలం ఉంచుకోవాలి. ప్లాంటామైసిన్ అనే మందును పది లీటర్ల నీటిలో రెండు గ్రాములు కలిపి గాని లేదా ప్లాంటమైసిన్‌తో కాపర్ ఆక్సిక్లోరైడ్ (సీఓసీ)ను పది లీటర్ల నీటిలో 30 గ్రాములు కలిపి పైరుకు పిచికారి చేయాలి. ఎకరానికి 180 లీటర్ల నీరు ఉండేటట్లుగా చూసుకోవాలి. పొలం పూత మీద ఉన్న ప్రాంతాల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను కలపకుండా కేవలం ప్లాంటమైసిన్‌ను పిచికారి చేయాలి.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై సీరియస్

- సిరిసిల్ల కలెక్టర్‌కు షోకాజ్ నోటీస్

సిరిసిల్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రొటోకాల్ ఉల్లంఘించిన తీరుపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. నిబంధనలు పాటించకుండా వ్యవహరించడంపై గురువారం కలెక్టర్ నుంచి సంజాయిషీ కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన పూర్తవుతున్న క్రమంలో కలెక్టర్ వేదికపైకి రావడం, అలాగే ఆహ్వాన పత్రికల్లో సందేశం ఉంటుందన్న అంశాన్ని చేర్చకపోవడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి కలెక్టర్‌కు నోటీసు జారీ చేసి సోమవారం మధ్యాహ్నం వరకు వివరణ ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలో ఫిబ్రవరి 2025లో నిర్వహించిన బీపీఎడ్ 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-17, అండర్-19 బాక్సింగ్ పోటీల్లో రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను సాధించారు. అండర్-17 విభాగంలో డి వర్షిత్, అండర్-19 విభాగంలో విజయ్‌కుమార్, నరేశ్, సంజీవ్, స్వరూప్ బంగారు పతకాలను సాధించారు. విద్యార్థులను, పీఈటీలను, కోచ్‌ను ప్రిన్సిపాల్ కాళహస్తి అభినందించారు.

నయీం ఆస్తులపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతాం



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్యాంగ్‌స్టర్ నయీంను కేసీఆర్ ఎన్‌కౌంటర్ చేయించిన తరువాత అతడి దగ్గర ఉన్న 2 వేల ఎకరాల భూమి ఏమైందో? 2 వేల కోట్ల రూపాయలు ఎక్కడికి పోయాయో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం లెక్క చెప్పలేదని, దీనిపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, గజ్జల కాంతం తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నయీం ఆస్తులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాల్సిందిపోయి కేసీఆర్ ఖాజానాలో జమ చేశారన్నారు. స్వాధీనం చేసుకున్న సొమ్ము జాడ లేకుండా పోయిందని, దీనిపై నాడు కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రజలకు పత్రికా ముఖంగా చెప్పలేదని ప్రశ్నించారు. గ్రూపు-1 ఉద్యోగాలను రూ.3 కోట్లకు అమ్ముకున్నట్లు కేటీఆర్ చేసే ఆరోపణలు నిరిధారమైనవన్నారు. నిరుద్యోగులు, పేదలు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే వారిని అవమానించే విధంగా కేటీఆర్ వాఖ్యలు న్నాయన్నారు. స్వయాన కేసీఆర్ కూతురు కవిత, నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు ద్వారా కాళేశ్వరంలో అవినీతి జరిగింది వాస్తవమేనని చెబుతున్నారన్నారు. మరోపక్క కేసీఆర్, కేటీఆర్ లక్ష కోట్లు కాళేశ్వరం సొమ్ము కాజేసినట్లు కమీషన్ ముందు హరీష్‌రావు ఒప్పుకున్నారని, ఆ కుటుంబం అవినీతిని వారే బయటపెట్టిన విషయాలపై ప్రభుత్వం విచారణ చేస్తోందని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌కు జీవితం కాలమంతా తీహార్ జైలు చిప్ప కూడు తప్పదన్నారు. సచివాలయం కూల్చినపుడు బయటపడిన బంగారం పంప కాల్లో తేడా రావడంతోనే కవిత బయటికి వచ్చి వాస్తవాలు వెలుగులోకి తెచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ మూడో సారి అధికారంలోకి వస్తే ఈ రాష్ట్రాన్ని అమ్మేసేవారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎర్ర శ్రీనివాస్, క్యాదాషి ప్రభాకర్, సముద్రాల అజయ్, గజ్జెల ఆనందరావు, నీరుకుళ్ల అనిల్, గడ్డం నాగరాజు, గుంటుకు రవి కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



ప్రభావతి (ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి అదృశ్యమైన ఓ వృద్ధురాలి మృతదేహం వరద కాలువలో లభ్యమైంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన కామని ప్రభావతి(66)కి కొన్ని రోజులు మతిస్థిమితం లేకపోగా మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగ గురువారం మల్యాల మండలం నూకపల్లి శివారులో గల వరదకాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహం ఫోటోలను సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో మృతురాలి కొడుకు శ్రీనివాస్ తన తల్లి మృతదేహంగా గుర్తించి పోలీసులును సంప్రదించాడు. దీంతో అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

- 38 గేట్ల ద్వారా 2,93,747 క్యూసెక్కుల నీరు దిగువకు



ఎస్సారెస్పీ నుంచి విడుదలవుతున్న నీరు

జగిత్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. 38 గేట్లు పైకి ఎత్తి 2,93,747 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గురువారం వరకు 66.233 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి 4.81 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పెద్దపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి గురువారం సాయంత్రం వరకు 4,28,800 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో గోదావరిలోకి 38గేట్ల ద్వారా 4,84,458 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,32,544క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 6,472క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 1,89,784 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.706 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి ఇంకా వరదనీరు వస్తున్నది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) గురువారం 9,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4,700 మానేరు, వాగు ద్వారా 4,700 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. మూడు గేట్ల ద్వారా 5,500 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.171 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపు ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.27 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 3,200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 3,300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగు నుంచి 13,409 క్యూసెక్కుల నీరు, ఎగువ మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి 5500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 1400క్యూసెక్కులు మొత్తం 20,309క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వచ్చి చేరుతున్నాయి. ఇన్‌ఫ్లోలు పెరుగుతుండటంతో గురువారం మధ్యాహ్నం 2.15గంటల వరకు 6గేట్ల నుంచి 12వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్న అధికారులు మరో రెండు గేట్లు ఎత్తి మొత్తం 8 గేట్ల ద్వారా 16వేల క్యూసెక్కులకు పెంచారు ఎల్ఎండి 8 స్పీల్‌వే గేట్ల నుంచి 16వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 4వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. ఎల్ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 23.861 టిఎంసిల నిల్వ ఉంది.

హ్యాకథాన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వనాథరాజు

కొడిమ్యాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : హ్యాకథాన్ కార్యక్రమాలను ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు అన్నారు. మూడు రోజులుగా మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఇంటర్నల్ 2025కార్యక్రమం బుధవారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు మాట్లాడుతూ హ్యాకథాన్ కార్యక్రమంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు అనుభవం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నూతన ఆవిష్కరణలు చేశారు. వీరిలో 8జట్లు ఎంపిక కాగా, ఎంపికైన జట్లు జాతీయ స్థాయిలో జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.


ఉమ్మడి జిల్లా ఉషు పోటీలకు విశేష స్పందన

● 200 మంది క్రీడాకారులు హాజరు




పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ ఉషు పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని కశ్మీర్‌గడ్డ ఫండస్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది బాలబాలికలు వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. అంతకుముందు ఫండస్ పాఠశాల చైర్మన్ గోపు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని అన్నారు. ఫండస్ పాఠశాల ఆధ్వర్యంలో ఉషు క్రీడలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బాలబాలికలకు వేర్వేరుగా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులను రాష్ట్ర పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషు సంం చైర్మన్ సుశాంక్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ పద్మజా రెడ్డి, జిల్లా ఉషు సంఘం అధ్యక్షుడు బార విద్యాసాగర్, కార్యదర్శి శేఖర్, టీజీ పెటా అధ్యక్షులు శంకరయ్య, జిల్లా ప్రైవేట్ పెటా బాధ్యులు మహేష్, గౌతమ్ రెడ్డి, అనూప్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.



మునుల గుహలోకి వెళ్లే మార్గం



అంజన్న ఆలయం

నిరాదరణకు గురవుతున్న మునుల గుహ

మల్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి ఈశాన్యంలో కోనేరు పక్కన గల మునుల గుహ నిర్లక్ష్యానికి గురవుతోంది. పూర్వ కాలంలో మునులు ఇక్కడి గుహలో తపస్సు చేసే వారని కొండపైన కొలువైన ఆంజనేయస్వామికి పూజలు చేశారని భక్తులు చెబుతుంటారు. దీంతో నిత్యం మునుల గుహలో దీపం వెలిగిస్తుంటారు. గుహ ప్రవేశ మార్గంలో అపరిశుభ్రత నెలకొనడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి మునుల గుహ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించడంతో పాటు ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు.

ఖాళీ సీసాల శబ్దం.. పక్షుల పలాయనం



వరి చేను చుట్టూ వేలాడదీసిన ఖాళీ సీసాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు18: పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను పక్షుల బారి నుంచి రక్షించుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని రైతు అల్లె సత్తయ్యకు ఓ ఆలోచన తట్టింది. గ్రామంలో సేకరించిన ఖాళీ మద్యం సీసాలను తను సాగు చేసిన 13 గుంటల వరి చేను చుట్టూ కర్రలకు వేలాడదీశాడు. గాలి వచ్చినప్పుడల్లా కర్రకు ఖాళీ సీసా తగులుతుండడంతో శబ్దం వస్తోంది. దాంతో పక్షులు వరి చేనుపై వాలకుండా బెదిరిపోతున్నాయని రైతు సత్తయ్య పేర్కొన్నాడు.

ఇరుకురోడ్డుతో ఇబ్బందులు



గన్నేరువరంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్న లారీ, బస్సు

గన్నేరువరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒకే సమయంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే ఏదో ఒక వాహనం వెనుకకు తీసుకోవల్సిన పరిస్థితి నెలకొంది. మండలానికి గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు మంజూరైనా పనులు నిలిచిపోవడంతో వాహనదారులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి చావడి చౌరస్తా వరకు రోడ్డు వెడెల్పు పనులను పూర్తి చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తొలగుతాయి. స్కూల్ కాంప్లెక్స్ వద్ద నిత్యం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలను, కార్లను రోడ్డు పైనే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధికారులు వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



గన్నేరువరంలో ఇరుకైన ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ దివస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కరీంనగర్‌లో హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రసంగాలు, కవితలు, బుద్ధికథలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నాయి. విజేతలకు నెహ్రూ యువకేంద్రం సహకారంతో బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, టోలిక్ అధికారి రోహిత్ కుమార్ షా, సీనియర్ జర్నలిస్ట్ ఇమ్మాముద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి సన్మానం

భగత్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన దామరపల్లి శ్రీనిజరెడ్డినిరెడ్డి జాగృతి ఆధ్వర్యంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి గురువారం సన్మానించారు. రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు దామరపల్లి జగ్గారెడ్డి, తెలంగాణ స్టేట్ యూత్‌రెడ్డి ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి అశోక్‌రెడ్డి, రెడ్డి జాగృతి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిగిరి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని యోగా గురువు మర్రి రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ 12వ డివిజన్ వార్డు కార్యాలయంలో 11 రోజులుగా ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆరోగ్య ంగా ఉండాలనే సత్‌సంకల్పంతో మహిళలకు యోగాలో శిక్షణను అంది స్తున్నట్లు చెప్పారు. మాజీ కార్పొరేటర్ తోట రాములు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందనలు


అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మెట్టుపల్లి సింధును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. ఇటీవల జిల్లాస్థాయి చేతిరాత పోటీలను నిర్వహించగా ప్రథమ స్థానాన్ని సాధించిన సింధుకు ఎమ్మెల్యే 2500 రూపాయల ప్రోత్సాహక బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగం శ్రీనివాస్, ఉపాధ్యాయులు బబిత, పల్లవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహేంద్ర సంఘం నాయకుల రక్తదానం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వెదురుబొంగుల దినోత్సవం, ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా మహేంద్ర సం ఘం నగరశాఖ నాయకులు శుక్రవారం రక్తదానం చేశారు. నగర అధ్యక్షుడు ఏకుల రమేశ్, కార్యదర్శి ఎనగందుల రమేశ్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, పిట్టల కనకయ్య, రేపాల వీరస్వామి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చింతల ప్రభాకర్, చింతల శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి చాటుకునేందుకు ముట్టడి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి తన ఉనికి చాటుకోవడానికి కొంతమంది కిరాయి మూకలతో టీజీఎస్పీఎస్ కార్యాలయం ముట్టడి చేపట్టిందని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పదవులు అనుభవించినప్పుడు ఇలాంటి పోరాటాలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మొద్దు నిద్ర పోయిన కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని కుట్రతో కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారని పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్‌డీఎస్ఎఫ్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాన్నయంగా జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ఏర్పాటు చేసినట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. గురువారం స్థానిక శ్రీనివాస్‌హోటల్‌లో దళిత బహుజన పార్టీ ఆవిర్భావ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల నాయకత్వంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీలు, కులసంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాజకీయ ఫ్రంట్‌గా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల 26న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి సూత్రధారి కేసీఆరే

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అవినీతికి కేసీఆరే సుత్రధారి అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమో క్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని ఫ్రంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ చుట్టూకొన్ని శక్తులు ఉన్నాయని వారితోనే కేసీఆర్ అకారణంగా అభాసుపాలు అవుతున్నాడని ఎమ్మెల్సీ కవిత ఇటీవల పేర్కొన్నారని, అవినీతికి సూత్రధారే కేసీఆర్ అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎంతోమంది నిపుణులు తప్పు బట్టారన్నారు. కేసీఆర్‌తో తెలంగాణ రాలేదని, ఉద్యమంలో కేసీఆర్ ఒక భాగమేనని అన్నారు. తొలిదశ ఉద్యమం 1969లో మలిదశ ఉద్యమం 2000లో కాంగ్రెస్ నాయకులు మొదలు పెట్టారని గుర్తు చేశారు.

మానకొండూర్ జీపీ ఎంప్లాయిస్ కమిటీ

మానకొండూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్ నూతన కమిటీ గురువారం ఏర్పాటైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా గాజర్ల రాజు, ప్రధాన కార్యదర్శి గుపాల జగదీశ్వర్, ఉపాధ్యక్షులు ఎలుకపల్లి మల్లవ్వ, గడ్డం శ్రీకాంత్, సహాయ కార్యదర్శి గోనె రాజమ్మ, కోశాధికారి వాసాల రేణుక, కమిటీ సభ్యులు యూసుఫ్, శంకర్, కృష్ణహరి, లక్ష్మణ్, వెంకటేష్, సబిత, సరోజనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

గంగాధర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల కాంగ్రెస్ నాయకులు అంబే ద్కర్‌ను అవమాన పరిచారంటూ బూరుగుపల్లిలో దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పాత పూలమాలలు తీయకుండా వాటిపైనే పూలమాలలు వేయడం సరికాదన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

గంగాధర, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అందరి బాధ్యతని ఎంపీడీవో దమ్మని రాము అన్నారు. గురువారం స్వచ్ఛత హీ సేవాలో భాగంగా బూరుగుపల్లిలో జిల్లా యూనిసెఫ్ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.యూనిసెఫ్ జిల్లా సమన్వయ కర్త కిషన్ స్వామి, స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చిగురుమామిడి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి గ్రామ శివారు ప్రాంతంలో పాంబండ వద్ద సర్వేనెంబర్ 840, 841లో ఉన్న ప్రభుత్వ భూమిని మాల, మాల ఉపకులాలకు కేటాయించాలని కోరుతూ మాల సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జాతీయ మాల మహానాడు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి బోలుమల్ల సదానందం, మండల సీనియర్ నాయకుడు మాశం సదికుమార్, మాల సంఘం నాయకులు పోచయ్య, శ్రీనివాస్, రాజయ్య, సదానందంద పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. మానవాళి మనుగడకు శ్రీరామరక్ష

గణేశ్‌నగర్,సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ.. మానవాళి మనుగడకు శ్రీరామరక్ష అని వక్తలు అన్నారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జంతు శాస్త్ర విభాగం, అన్నామలై విశ్వవిద్యాలయం తమిళనాడు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అవగాహన, కాలుష్య నివారణపై గురువారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

భగత్‌నగర్ సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. నగరంలోని జ్యోతినగర్ పార్కులో చెత్తను శుభ్రం చేశారు. నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. సేవా పక్షం కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి, కో-కన్వీనర్ వంగల రవి, తిరుమల్ రెడ్డి, రాగి సత్యనారాయణ, శక్తి కేంద్రం ఇన్ చార్జిలు ఎన్నం ప్రకాశ్, శానకొండ వాసు, బూత్ అధ్యక్షుడు బండ రాకేష్, మాధవరెడ్డి, కేశవరెడ్డి, రమేష్ చంద్ర పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షం అభియాన్ కార్యక్ర మంలో భాగంగా గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, ప్రభాకర్, వేణు, శ్రీనివాస్, చంద్రిక, రాజశేఖర్, సంజీవరెడ్డి, శశిధర్, రమేష్, వెంకటేష్, తిరుపతి, సారయ్య, మాధవి, దేవేంద్ర, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

గన్నేరువరం: బీజేపీ సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా మండల బీజేపీ అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి రోడ్డుపై చెత్తను తొలగించి స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, పుల్లెల జగన్మోహన్, మచ్చ బాలరాజు, లక్ష్మణ్, వినయ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికపై విమర్శలు

హుజూరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అవకతవకలు జరిగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కమిటీలో ఉన్న సభ్యుడు అవార్డు తీసుకోవడంతో ఉపాధ్యాయ సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉండగా ఎంఈవో అందుబాటులో లేక చేయలేదు. రెండు రోజుల క్రితం ఎంపిక జరిగింది. అవార్డులను శుక్రవారం అందజేయనున్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వ్యక్తికి మరోసారి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం గమనార్హం. హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఆ పాఠశాలల హెచ్ఎంలకు తెలియక పోవడం శోచనీయం.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

మానకొండూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మానకొండూర్ బాలుర విద్యార్థులు గురువారం పీఎంశ్రీ పథకంలో భాగంగా అలుగునూర్‌లోని కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఆటలు, విద్యావిధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మానేరుడ్యాం ఆర్టీఏ ట్రాఫిక్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి 25 వరకు అల్ఫోర్స్ స్కాలర్‌షిప్ టెస్ట్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులకు చేయూతనిచ్చేందుకు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో రెండేళ్ల పాటు ఐఐటీ, నీట్ శిక్షణలో భారీ రాయితీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నగరంలోని విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్, సీబీఎస్ఈ పదోతరగతి విద్యార్థులకు టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహికులు రాష్ట్రంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో పరీక్షకు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 9133537444, 9160294441, 9246934456, 9246934441 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

బాక్సింగ్‌లో శ్రీచైతన్య విద్యార్థులకు బంగారు పతకాలు


గోల్డ్ మెడల్స్ సాధించిన శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. జి.హరిహర(46కేజీల విభాగంలో) పి.విగ్నేష్(48 కేజీలు) రితిక్(50 కేజీలు), కే.అఖిల్(52కేజీలు), ఎన్.అభిరాం (54 కేజీలు), బి.అమన్(57కేజీలు) డి.ఉదయ్ కుమార్ (63కేజీలు), ఎం.యశ్వంత్(66కేజీలు) జి.మోక్షిత్ (70కేజీలు), ఎం.మోహన్(80కేజీలు) మొత్తం తొమ్మిది మంది గోల్డ్ మెడల్స్, 60కేజీల విభాగంలో ఎస్.కార్తీక్ రెండో స్థానంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి అభినందించారు. కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పల్లె శ్యాం సుందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కోచ్ శ్రీకాంత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

భగత్‌నగర్: సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించారు. అక్టోబరు 25, 26 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లికి చెందిన పత్తి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబాన్ని జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.

హుజూరాబాద్: పట్టణంలోని చనుమల్ల ప్రసాద్ గత కొన్నే ళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, 1987-88పదో తరగతి బాల్యమిత్రులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 35,500 నగదు అందజేశారు.

సైదాపూర్: వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం 65వ అర్థ వార్షిక మహాసభ శుక్రవారం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అధ్యక్షతన సంఘం ఆవరణలో జరగనున్నట్లు సంఘం సీఈవో చెన్నవేణి శ్రీధర్ తెలిపారు.

కరీంనగర్ టౌన్ : జిల్లాలో ఈనెల 21న పితృ అమావాస్య, ఎంగిలిపూల చిన్న బతుకమ్మ ప్రారంభమవుతుందని నగర ప్రధాన వైదిక పురోహితుడు మంగళంపల్లి శ్రీనివాస్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి శ్రీదేవి శరన్న వరాత్రోత్సవాలు ప్రారంభమ వుతాయని, 29న సద్దుల బతుకమ్మ, 30న సువాసినీ పూజ, అక్టోబరు 1న మహానవమి, 2న విజయదశమి (దసరా) జరుపు కోవాలని సూచించారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

కరీంనగర్ టౌన్: సాహిత్య విమర్శనా చరిత్రను శోధించి, విమర్శనా రంగానికి మార్గదర్శకుడైన ఆచార్య ఎస్వీ రామారావుకు గురువారం పలువురు రచయితలు ప్రకటనలో నివాళులర్పించారు. పరిషత్ అధ్యక్షుడు రవీందర్, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ రామకృష్ణ, నంది శ్రీనివాస్, గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, పద్మశ్రీ, అనిత, శ్రీకర్, శ్రీనివాస జీయం గార్, అనంతాచార్య ఉన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగలు సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతీ వైభవానికి ప్రతీక అని అన్నారు. బతుకమ్మ పండుగ అనగానే అందరికీ గుర్తువచ్చేది పల్లెపాటలు, కోలాటాలు అని, నేటి కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ బతుకమ్మ ఉత్సవాల వైభవం తగ్గక పోవడం పండుగ గొప్పతనం అన్నారు.


వేడుకల్లో చిన్నారులతో నరేందర్‌రెడ్డి

అంజయ్యకు రావికంటి వసునందన్ సాహిత్య పురస్కారం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన రచయిత కందుకూరి అంజయ్య డాక్టర్ రావికంటి వసునందన్ సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అందిస్తున్న దర్మనిధి సాహిత్య పురస్కారాల్లో భాగంగా గురువారం పరిషత్తులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో అందజేశారు. పురస్కారం కింద 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని పరిషత్తు అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జుర్రు చెన్నయ్య, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, గాజోజు నాగభూషణం, బూర్ల వేంకటేశ్వర్లు, సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, కవులు, రచయితలు అంజయ్యకు అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందుతున్న అధ్యాపకులు పెన్షన్ పొందలేకపోతున్నారని విన్నవించారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ పెండింగ్ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేటట్లు చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సమస్యలను ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా గుంత

శంకరపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ నుంచి మొలంగూర్, వీణవంక రోడ్డును కలిపే మార్గంలో రాజాపూర్ శివారులో గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంత రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రివేళ ఎదురుగా వాహనం వచ్చినప్పుడు కనిపించక పడిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. వెంటనే గుంత పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు


డాక్టర్ రజనీ ప్రియదర్శినికి జ్ఞాపిక అందిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నెలసరి ఆరోగ్య, పరిశుభ్రతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు నెలసరి పరిశుభ్రత ఆరోగ్య విధి విధానాలను తెలుసుకోవాలన్న ఉద్దేశంతో సదస్సు నిర్వహించామన్నారు. రెనే హాస్పిటల్ డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతీ ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మైల్డ్ సోప్స్ వాడాలని, ప్రతీరోజు తగినంత నీరు తాగుతూ సరైన ఆహార అలవాట్లు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఆర్గనైజర్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలకు 'మానేరు' విద్యార్థి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నగరంలోని మానేరు విద్యాసంస్థల విద్యార్థిని సుస్వర మౌక్తిక ఎంపికైనట్లు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ఇన్‌స్ట్రుమెంటల్ మెలోడీ విభాగంలో పాఠశాల విద్యార్థిని సుస్వర మౌక్తిక ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు, వంతడుపుల గ్రామాల్లో వరి క్షేత్రాలను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్ మాట్లాడుతూ పైరులో కొద్దిగా ఆకు ముడత ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. శాస్త్రవేత్తలు ఉషారాణి, ఉమారాణి, కృష్ణారెడ్డి, ఏవో సూర్యనారాయణ, ఏఈవోలు మమత, రాకేష్, పాల్గొన్నారు.

● చిగురుమామిడి: చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్, సుందరగిరి, రేకొండ గ్రామాలలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పొలాస శాస్త్రవేత రాజేష్, మానకొండూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నారెండ్ల శ్రీధర్, మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ, ఏఈవోలు ప్రణయ్, అంజలి, అఖిల్, ఫరీదుద్దీన్, సాయికు మార్ రైతులు పాల్గొన్నారు.

●చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో వరిక్షేత్రాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. నాణ్యమైన విత్తనం-రైతులకు ఆపన్న హస్తం కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన విత్తనోత్పత్తి క్షేత్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్, శాస్త్రవేత్తలు ఉషారాణి, ఉమారాణి, మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, ఏఈవో రమ్య పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

సుభాష్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్లు కోల అన్నారెడ్డి, శ్రీరాముల శ్రీనివాస్, నోముల సుధీర్, అలిశెట్టి రాజేంద్రప్రసాద్, ఆలుకంటి వెంకటరెడ్డి, తుమ్మల లోకేశ్వర్‌రెడ్డి, శ్రీపతి, ఆంజనేయులును సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు పాత కిరణ్‌కుమార్, కార్యదర్శి రోండ్ల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి తొడుపునూరి నాగశేషు, మైక్రోక్యాబినెట్ మెంబర్ మంద వెంకటరమణ, సంపతికుమారి, రీజియన్ చైర్ ప్రసాద, ఎఫ్‌డబ్ల్యూసీ సరళ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామడుగు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నుంచి మల్యాల వరకు పలు గ్రామాలను రాగంపేట, గోపాల్‌రావుపేట, బూరుగుపల్లి, తక్కలపల్లి గ్రామాలను కలుపుతూ డబుల్ రోడ్డు కోసం 50 కోట్ల సీఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయడం పట్ల మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పిండి సత్యంరెడ్డి, నాయకులు బొమ్మరవేణి తిరుపతి, ఎడవెల్లి నరేందర్ రెడ్డి, దుబ్బాసి బుచ్చయ్య, రేణిగుంట బాపురాజు, ఏగోలపు మల్లేశం, కర్ర శ్యాంసుందర్ రెడ్డి, రాజిరెడ్డి, టి హనుమంతు, రమణారెడ్డి పాల్గొన్నారు.

● గంగాధర : మండలంలోని బూరుగుపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. చొప్పదండి నుంచి గంగాధర మండలం మీదుగా మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 50 కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకుడు సాగి అజయ్‌రావు ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, మండలాధ్యక్షుడు పురమల్ల మనోహర్, నాయ కులు బూర్గు గంగన్న, సంపత్, బాబు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి : మండలంలోని ఆర్నకొండలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఆర్నకొండ-మల్యాల డబుల్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరైన సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

జమ్మికుంట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతని, పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. గురువారం స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని పార్క్‌లో కమిషనర్ చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పరిసరాల అపరిశుభ్రతతో దోమలు వ్యాపిస్తాయన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, టీపీవో శ్రీధర్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్లు వాణి, భాస్కర్ పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న కమిషనర్ అయాజ్

సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎండీ షేక్ నిసార్ అహ్మద్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ షేక్ నిసార్ అహ్మద్‌ను నియమించారు. గురువారం స్థానిక రెవెన్యూక్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.స్థిత ప్రజ్ఞ నియామకపత్రాన్ని అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా గోనె శివరాంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న సీపీఎస్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు షేక్ నిసార్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు జహార్ ఉద్దీన్, డి.రాజు, ఎండీ అఖిల్ అహ్మద్, సయ్యద్ అసద్, మసూద్ అలీ, రాములు, బషీర్‌హుస్సేన్, సుహైల్ హుస్సేన్, బి.శ్రీనివాస్, మహ్మద్ అక్రం, ఎం.వాణి, జె.సతీష్, ఆయిషా ముమ్తాజ్, ప్రవీణ్, వినయ్, షారూక్‌ఖాన్, అతిక్ అహ్మద్, అహ్మద్ పాషా, ముజీబ్ అహ్మద్‌ఖాన్, జీషాన్, కొండయ్య, శ్రీనివాస్, శ్యామ్, షఫిక్ తదితరులు పాల్గొన్నారు.